
చావలి వాలేశ్వరస్వామి దేవస్థానంలో బాల త్రిపుర సుందరిగా అమ్మవారు


ఐలవరంలో బాలాత్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు


భట్టిప్రోలు వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో...


గాజుల్లంకలో బాలాత్రిపుర సుందరి దేవిగా అమ్మవారు


కోటిపల్లి సోమశేఖరాలయంలో...

క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవాని పాలెం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీవో అమృతలూరి ఎలీషాబాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

వర్షం ప్రభావంతో కూలిన పెంకుటిల్లు పైకప్పు



కొల్లూరు: భారీ వర్షం ప్రభావంతో పెంకుటిల్లు పైకప్పు కూలి త్రుటిలో పెను ప్రమాదం తప్పిన ఘటన చోటు చేసుకుంది. బాధితులు, రెవెన్యూ అధికారుల కథనం మేరకు.. కొల్లూరు పాడితోటలు ప్రాంతంలో పాముల రత్నం కుటుంబ సభ్యులతో కలసి పాతకాలపు పెంకుటింట్లో నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షం కారణంగా నానిన పెంకుటిల్లు సోమవారం ఉదయం అకస్మాత్తుగా కుప్పకూలింది. గృహం పైకప్పు కూలే సమయంలో ఇంటి లోపల టీవీ చూస్తున్న రత్నం కుమారుడు ఇల్లు కూలుతున్న శబ్దాన్ని పసిగట్టి బయటకు పరిగెత్తుకెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. గృహోపకరణాలు మాత్రం ధ్వంసమయ్యాయి. ప్రమాద ఘటనపై రెవెన్యూ యంత్రాంగం వర్షం కారణంగా నాని ఇంటి పైకప్పు కూలిందని పేర్కొంటుండగా, బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ఆదివారం రాత్రి పిడుగు పడిన కారణంగా గృహం పైభాగం దెబ్బతిని కూలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శక్తి సముపార్జనకే దేవి నవరాత్రులు

ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం



అమృతలూరు(భట్టిప్రోలు): శక్తి సముపార్జన కోసమే దేవి నవరాత్రులలో అమ్మవారిని పూజించడం జరుగుతుందని సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు పేర్కొన్నారు. సోమవారం అమృతలూరు మండలం గోవాడ గ్రామ ధార్మిక సమావేశం లక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించారు. హేమశంకరరావు మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని ధర్మాలలో హిందూ ధర్మం శ్రేష్ఠమైనదని అన్నారు. గ్రామంలోని హిందువులందరూ ఐక్యతగా ఉంటూ హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలని కోరారు. అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీ నవరాత్రులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ధార్మిక సమితి సభ్యులు కొండపల్లి ప్రసాద్, లక్ష్మి, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

వేమూరు: సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 24వ తేదీన వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ సయ్యద్ జర్వీన్ పర్వాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు మెడికల్ క్యాంప్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. మహిళలకు సంబంధించిన వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. క్యాంప్‌కు మహిళలు హాజరు కావలెనని ఆమె కోరారు.

నేడు మున్సిపల్ కార్యాలయంలో లోక్ కళ్యాణ మేళ

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక కుటుంబం -ఒక వ్యాపారవేత్త కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో లోక్ కళ్యాణ మేళాను నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో పీఎం స్వానిధి 2.0 పథకం కింద కొత్త రుణాలకు దరఖాస్తులు, పెండింగ్ దరఖాస్తులను ప్రాసెస్ చేయిచడం వంటివి చేయనున్నట్లు చెప్పారు.

వైభవంగా దేవి శరన్నవరాత్రులు ప్రారంభం

పలు దేవాలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణలు

భట్టిప్రోలు: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా తొలి రోజు సోమవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో అశ్వద్‌న్నారాయణ మహాలక్ష్మి దేవతా వనవృక్షం ఆవరణలో అమ్మవారు బాలా త్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. వెల్లటూరు కట్లమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఐలవరం దేవీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 23వ మహోత్సవాలలో భాగంగా అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. వెల్లటూరు కనకదుర్గా మహంకాళి నాగేంద్రస్వామి దేవాలయం (లాక్ సెంటర్‌లో)లో జొన్నా సుబ్బారావు భవాని ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భట్టిప్రోలు భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, రాజ్యలక్ష్మి సమేత విఠలేశ్వరస్వామి, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, వెల్లటూరులోని బాలాత్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవాలయాల్లో లలితా సహస్ర నామ పఠనం, కుంకుమ పూజలు జరిగాయి. స్థానిక షిర్డి సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న 107వ ఆరాధనోత్సవాలలో భాగంగా బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు పర్యవేక్షించారు. హిందూ శ్మశాన వాటికలో కొలువైన గుండి పార్వతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భట్టిప్రోలులో వాసవి కన్యకాపరమేశ్వరి, పార్వతి దేవి అమ్మవార్లు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. బతుకమ్మ పూజలు, సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఎంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో మొదటిరోజు అమ్మవారు లలితాత్రిపుర సుందరిగా పూజలందుకున్నారు. మండల కేంద్రంలోని కాళికాంబ ఆలయం, పెద్దింటమ్మ అమ్మవారి ఆలయం, ఆదిశేషుని ఆలయంతో పాటు కొత్త నందాయపాలెం దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయం, మండల పరిధిలోని బోలాయపాలెం, దమ్మనవారి పాలెం, పాతనందాయపాలెం, నల్లమోతువారిపాలెం, ఏట్రవారిపాలెం, ఎంవిరాజుపాలెం, సత్యవతీపేట, సమ్మెటవారిపాలెం గ్రామాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి శరన్నవరాత్రులలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో బతుకమ్మ ఊరేగింపు

వేమూరులో...

వేమూరు: వేమూరు మండలంలోని చావలి వాలేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి బాల త్రిపుర సుందరిగా అలంకరణ చేయడం జరిగిందని పూజారి మణికంఠ శర్మ సోమవారం తెలిపారు. అమ్మవారికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


గాయత్రీదేవి ఆలయంలో మాలలు ధరిస్తున్న దీక్షాపరులు

చుండూరు(వేమూరు): దేవి నవరాత్రులు సోమవారం ఉదయం నుంచి ప్రారంభించడం జరిగిందని ప్రధాన పూజారి లక్ష్మీకాంతరావు తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు కనకదుర్గ దేవస్థానంలో సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నగరంలో...

నగరం: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లోని దేవాలయాల్లో ఏర్పాటు చేసిన కనక దుర్గమ్మ అమ్మవారి విగ్రహాలకు తొలిరోజు బాల త్రిపుర సుందరిగా అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. మండలంలోని కొలగానివారిపాలెం రామ మందిరంలో కనకదుర్గమ్మ అమ్మవారికి బాల త్రిపుర సుందరిగా అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకమ పూజలు చేశారు. నగరంలోని అయ్యప్పస్వామి, వేంకటేశ్వరస్వామి దేవస్థానం, సంతబజార్, మీసాలవారిపాలెం రామ మందిరం ఆవరణలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


కర్లపాలెం కాళికాంబ ఆలయంలో...

కొల్లూరులో...

కొల్లూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా ఆరంభమయ్యాయి. పలు గ్రామాలలో ఆలయాలు విద్యుత్ దీపాల అలంకరణతో నూతన శోభను సంతరించుకున్నాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొలిరోజైన సోమవారం అమ్మవారు ప్రత్యేక అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గాజుల్లంకలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులను ఆకట్టుకున్నారు. అర్చకులు గాడేపల్లి శివ అమ్మవారికి పూజలు చేశారు. మండలంలోని కోటిపల్లి సోమశేఖరాలయంలో బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. కొల్లూరు అనంతభోగేశ్వరాలయంలోని పార్వతి అమ్మవారు తొలి రోజు స్వర్ణ కవచాలంకృత దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బ్రాహ్మణ సంఘం నేతృత్వంలో రాత్రి రేడియో, టీవీ వ్యాఖ్యాత దీవి హయగ్రీవాచార్యులు నిర్వహించిన పురాణ ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది.

బాపట్లలో...

బాపట్లటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బాపట్లలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయటంతోపాటు ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని రామానగర్ దుర్గమ్మ ఆలయం, ముత్తాయపాలెం రామాలయం, దరివాదకొత్తపాలెంలోని దుర్గమ్మ ఆలయం, కొత్తమద్దిబోయినవారిపాలెంలోని ఓంశక్తి అమ్మవారి ఆలయాల్లో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలోఅమ్మవారిని దర్శించుకున్నారు.

■ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణ, మండలంలోని సుమారు 200 మందికి పైగా సోమవారం పట్టణంలోని గాయత్రిదేవి దేవాలయంలో ఆలయ అర్చకులు డి.సుబ్రమణ్య శర్మ చేతుల మీదుగా ప్రసన్నదుర్గాభవానీ మాలలు ధరించారు. దీక్షాపరులు తొమ్మిదిరోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విజయదశమి రోజున ఇరుమడి ఎత్తుకొని విజయవాడ కొండకు వెళ్లి అమ్మవారిని దర్శించుకోనున్నారు.

బతుకమ్మ ఊరేగింపు

పట్టణంలోని ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం సమీపంలో బతుకమ్మను ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం బతుకమ్మ ప్రతిమలను వాహనంపై అమర్చి మంగళవాయిద్యాల నడుమ పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి 9 రోజులపాటు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.

బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు

బాపట్ల: స్థానిక బాపట్ల చీలురోడ్డులో వేంచేసి ఉన్న రుక్మిణి సమేత పాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపట్ల పట్టణంలో వేంచేసియున్న పోలేరమ్మతల్లిని నవరాత్రుల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు భారీగా పాల్గొన్ని మొక్కులు తీర్చుకున్నారు.


నగరం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో...

ఘనంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు


చెరుకుపల్లి బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో...

రేపల్లె(చెరుకుపల్లి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మండంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం నుంచే ఆలయాల్లో అర్చకులు అమ్మవారికి అభిషేకం, కలశస్థాపన, దుర్గాసప్తశతి పారాయణ నిర్వహించారు. రేపల్లె పట్టణంలోని భ్రమరాంబ సమేత చెన్నమలేకలశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు, అదేవిధంగా చెరుకుపల్లి మండల కేంద్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత బాలకోటేశ్వరస్వామి దేవస్థానం, గుళ్లపల్లి గ్రామంలో వేంచేసియున్న గంగాబికా సమేత ఆనందీశ్వరస్వామి దేవస్థానంలో 29వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, పిట్టు కోటిరెడ్డిపాలెంలో ఓరుగంటి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 87వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, ఘనంగా ప్రారంభించారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయ కమిటీ వారు అందజేశారు.


రేపల్లె భ్రమరాంబ సమేత చెన్నమలేకలశ్వర స్వామి దేవస్థానంలో

ప్రజా సమస్యలు బాధ్యతగా పరిష్కరించాలి

రేపల్లె(చెరుకుపల్లి): అధికారులు బాధ్యతగా పని చేసి ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలన చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 అర్జీలు వచ్చాయని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు బదిలీ చేయటం జరిగిందన్నారు. రేపల్లె మండలం బేతపూడి గ్రామం ఉయ్యూరువారిపాలెం రేపల్లె మున్సిపాలిటీలో విలీనం చేయు నిమిత్తం రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని అందులో తమ భూములు కోల్పోతున్నామని రోడ్డు మార్జిన్ పరిశీలించాలని అర్జీ, బేతపూడి గ్రామం ఉయ్యూరువారిపాలెంలో సర్వే నంబర్ 436 గూగుల్ మ్యాప్‌లో రెడ్ కలర్ చూపించటం జరిగిందని దీనికి గల కారణం తెలపవల్సిందిగా అర్జీ, చెరుకుపల్లి మండలం గూడవల్లి గ్రామానికి చెందిన చావా నాగశిరీష వారి భూమి సీసీఆర్‌సీ కార్డు వేరొకరికి మంజూరు చేయటం జరిగిందని దానిని రద్దు చేయాలని, నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామానికి చెందిన వంకాయల వెంకటేశ్వరరావు తన భూమికి సర్వే చేసి హద్దులు చూపించాలని అర్జీలు అందజేశారు. కొల్లురు మండలం జంపని గ్రామానికి చెందిన గుమ్మడిదల వెంకట రామయ్య సర్వే నంబర్ 394 ఆన్‌లైన్‌లో టెక్నికల్ సమస్య ఉందని దానిని సరిచెయ్యాలని, రేపల్లె మున్సిపాలిటీకి చెందిన కొలుసు నాగలక్ష్మీ వితంతు పింఛనుకు, రేపల్లె మండలం లంకెవానిదిబ్బ గ్రామానికి చెందిన విశ్వరాథపల్లి వీరరాఘవయ్య సర్వే నబర్ 435 సంబంధించి రికార్డు మంజూరు చెయ్యాలని, నగరం మండలం న్యూ అంబేడ్కర్ నగర్‌కు చెందిన డొక్కు శ్రీనివాసరావు అంబేడ్కర్ నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థలో ఉన్నదని వెంటనే మవ్మాతులు చేయించాలని, నిజాంపట్నం మండలం దిండి గ్రామానికి చెందిన పిన్నిబోయిన సుధాకర్ తన ఇల్లు వేసుకున్న 242 స్థలాన్ని వేరొకరు ఆక్రమంచుకునే ప్రయత్నం చేస్తున్నారని సమస్యను పరిష్కరించాలని అర్జీలు అందజేయగా, అర్జీలు స్వీకరించి తరలో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి



కొల్లూరు: సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల సీఐటీయూ నాయకుడు బొనిగల సుబ్బారావు పిలుపునిచ్చారు. సోమవారం కొల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సీఐటీయూ మహాసభలకు తరలిరావాలని సూచించారు. మహాసభలలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన విధివిధానాలపై చర్చించడంతోపాటు, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ నెల 27, 28 తేదీలలో రేపల్లెలో జరగనున్న జిల్లా మహా సభలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు.

జగనన్న పాలన రావాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

చెరుకుపల్లి: రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం సక్రమంగా అమలు జరగాలంటే మరలా జగనన్న పాలన రావాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. సోమవారం గుళ్ళపల్లిలోని డాక్టర్ గణేష్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమితులైన కొప్పుల గోపి డాక్టర్ గణేష్‌ను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలియజేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతనంగా నియమితులైన గోపిని డాక్టర్ గణేష్ అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లడుతూ కూటమి పాలనలో దళితులపై జరుగుతున్న దాడులు, సామాజిక అన్యాయాన్ని ప్రతి ఒక్క దళితుడు గుర్తుంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఇండస్ట్రియల్ అధ్యక్షుడు కె.జె.రత్నాకర్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు డాక్టర్ తిలక్, నగరం మండల యువజన విభాగం నాయకులు దగ్గుమల్లి పృథ్వీరాజ్, దాసరి ప్రసాద్, పంతగాని రమేష్, ఈమని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి బలం

చెరుకుపల్లి: కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి బలమని పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. సోమవారం డాక్టర్ గణేష్ కార్యాలయంలో మండలంలోని రాజవోలు గ్రామం రెడ్లపాలెంకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశానికి వచ్చిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసి జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునే విధంగా పని చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని వాటిని గ్రామ స్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ పిట్టు సాంబశివారెడ్డి, గోపిరెడ్డి, నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ గణేష్‌ను మర్యాద కలిసిన పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ కొప్పుల గోపి

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

- కోనపై వ్యాఖ్యలు సరికాదు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి

బాపట్ల: పేదోడికి ఒక పక్కన వైద్యం.. మరోవైపు ఉపాధి అవకాశాలు మెండుగా ఉండాలంటే మెడికల్ కళాశాలలు ప్రభుత్వమే నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చూపిన చొరవ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. 17 మెడికల్ కళాశాలల నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకుందన్నారు. చంద్రబాబు సర్కారు వాటిని ప్రైవేటు భాగస్వామ్యం పేరుతో కొంత మందికి కట్టబెట్టేందుకు ప్రయత్నించటం సరికాదన్నారు. బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి చేసిన కృషి, మెడికల్ కళాశాల స్థల సేకరణ దగ్గర నుంచి పనులు వేగవంతంగా జరిగే వరకు ఆయన చూపిన చొరవ ప్రజల నుంచి ఎన్నో మన్ననలు పొందాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు కోన పాలన గురించి మాట్లాడటం సరికాదని ఆయన సూచించారు.

■ మెడికల్ కళాశాలలను నిర్మించే విషయంపై స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు కులాలను రెచ్చగొట్టే విధంగా ఇప్పటి వరకు ఏమీ పీకుతున్నారని మాట్లాడటం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఇనగలూరి మాల్యాద్రి పేర్కొన్నారు. కులాలను అవమానించే విధంగా మాట్లాడటం ఏమిటో ఆయనే చెప్పాలన్నారు. బాపట్లలో ఏవిధంగా అభివృద్ధి జరిగిందో ప్రజలందరికి తెలుసునని, ఎవరితో చెప్పించుకోవాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీకి లేదన్నారు. చేతనైతే మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించే విధంగా చంద్రబాబుని ఒప్పించి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, నాయకులు కోకి రాఘవరెడ్డి, షేక్ సయ్యద్‌పీర్, నక్కా వీరారెడ్డి, జాలి రామిరెడ్డి, చల్లా రామయ్య, కొక్కిలిగడ్డ చెంచయ్య, జోగి రాజా, కోటా వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి

ఎన్‌సీసీ క్యాడెట్ల స్వచ్ఛతా హీ కార్యక్రమం

రేపల్లె(చెరుకుపల్లి): ఎన్‌సీసీ విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు స్వచ్ఛత కార్యక్రమాలలో భాగస్వాములు కావటం దేశ సేవ లాంటిదని రేపల్లె పట్టణ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ వసంత వీరరాఘవయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ పరిసరాలలో స్వచ్ఛతా హీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి కె.బాలగురవయ్య మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమం క్యాడెట్లలో సేవా భావాన్ని నింపుతుందన్నారు. ఎన్‌సీసీ జూనియర్ కేడర్ ఆఫీసర్ హేమంత్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం సంతోషం కలిగించిందని ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలలో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

